సాక్షి
మంచిర్యాల
ఆదివారం । 19 నవంబర్ । 2023



గూడెంలో కార్తీక సందడి
దండేపల్లి: మండలంలోని గూడెంలో శనివారం కార్తీక సందడి నెలకొంది. భక్తులు సత్యదేవుణ్ని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. 267 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు.



ఈవీఎం.. విశేషాలు
ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహణకు ఎన్నికల సంఘం అనేక సంస్కరణలు చేపడుతోంది. సాంకేతికతను ఉపయోగించుకుని ఈవీఎంలతో ఎన్నికలు నిర్వహిస్తోంది. 10లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /20.0

వాతావరణం
రోజంతా ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రివేళ ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న బిశ్వజిత్‌దత్తా

భీమిని: కన్నెపల్లి మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సాధారణ పరిశీలకులు బిశ్వజిత్ దత్తా శనివారం సందర్శించారు. జన్కాపూర్, కన్నెపల్లి, మెట్‌పల్లి గ్రామ పంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మౌలిక వసతులపై ఆరా తీశారు. మండలంలో ఉన్న పోలింగ్ కేంద్రాల వివరాలు స్థానిక తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని బీఎల్ఓలు గ్రామాల్లోని ఓటర్లకు పోలింగ్ చిట్టీలను అందజేయాలని సూచించారు. మెట్‌పల్లి పోలింగ్ కేంద్రం వద్ద మరుగుదొడ్డి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరగాలని సూచించారు. తహసీల్దార్ దత్తుప్రసాద్‌రావు, ఎంపీడీఓ రాధాకిషన్, ఏసీపీ సదయ్య, ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలి



ఓటరు స్లిప్పుల పంపిణీ పరిశీలిస్తున్న కలెక్టర్

కాసిపేట: ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు పోలింగ్ స్లిప్పుల పంపిణీ త్వరగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని దేవాపూర్ గ్రామంలో పలు వార్డుల్లో ఓటర్ స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు తమ పరిధిలో పంపిణీ ప్రక్రియను నిత్యం పర్యవేక్షిస్తూ గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు పరిశీలిస్తూ అవసరం ఉన్న చోట సౌకర్యాలు మెరుగుపర్చాలని సూచించారు. తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో ఎంఏ.అలీం పాల్గొన్నారు.

'ప్రభుత్వం ప్రజల కోసం ఏమీ చేయలేదు'



మాట్లాడుతున్న కోదండరాం

మందమర్రిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం ఏమీ చేయలేదని, అంతా ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం రాష్ట్రాన్ని దోచుకున్నారని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం ఆరోపించారు. శనివారం మందమర్రిలోని దీపక్‌నగర్‌లో ఉన్న శ్రీకృష్ణ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 18సార్లు ఉద్యోగ నోటిఫికేషన్ పేపర్లు లీకేజీ అయ్యాయని, 30లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం లక్షలు వెచ్చించి కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చెన్నూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జి.వివేక్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, తెలంగాణ ఉద్యమకారులు ఎండీ.మునీర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిన్నయ్యకు వైద్య పరీక్షలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మండలంలోని చాకేపల్లి గ్రామంలో రెండ్రోజుల క్రితం ఎన్నికల ప్రచారంలో అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రిలో చికిత్స అనంతరం మంచిర్యాలలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు వెళ్లగా వైద్యులు గుండె సంబంధిత పరీక్షలు చేసినట్లు సమాచారం. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని, ఆదివారం మరోసారి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పార్టీ శ్రేణుల సమాచారం.


నాయకా! నమ్మేదెట్లా?

జిల్లాలో ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు ఓ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించారు. స్థానిక ఎమ్మెల్యే లక్ష్యంగా తీవ్ర విమర్శలు చేశారు. ఆయన ఓటమి కోసం తాను కంకణం కట్టుకున్నానని శపథం చేశారు. టికెట్ల కేటాయింపులతో సీన్ రివర్స్ అయింది. ఆయనకు టికెట్ రాలేదు. దీంతో ఆ ఎమ్మెల్యే పక్కనే చేరాడు. కండువా మార్చి ఆయన గెలుపు కోసం ప్రచారం చేస్తున్నాడు. దీంతో మొన్నటి దాక ఆ పార్టీలో ఉండి విమర్శలు చేసి.. ఆయనకే మళ్లీ ఓటెయ్యమని కోరడంతో నియోజకవర్గ ప్రజలు అవాక్కవుతున్నారు.

జిల్లాలోనే మరో నియోజకవర్గానికి చెందిన ఆయన సొంత పార్టీ నుంచే టికెట్ ఆశించారు. స్థానిక ఎమ్మెల్యేకు టికెట్ ఇస్తే, రాజీనామా చేసి పోరాటం చేస్తానని ప్రకటించాడు. టికెట్ కేటాయింపు తర్వాత కూడా తీవ్ర ఆరోపణలు చేశారు. తీరా సమయానికి చల్లబడ్డారు. మళ్లీ ఆ ఎమ్మెల్యేతోనే కలసి పని చేస్తున్నారు.

జిల్లాలో ఇంకో నియోజకవర్గానికి చెందిన ఓ నాయకుడు తనకే ఈసారి టికెట్ అని చెప్పుకుంటూ తీవ్రంగా ప్రచారం చేశాడు. చివరకు టికెట్ దక్కకపోవడంతో వెంటనే పార్టీ మారిపోయాడు. గతంలో పని చేసిన పార్టీ అభ్యర్థి ఓటమే లక్ష్యంగా ఇప్పుడు మరో పార్టీలో చేరి వ్యతిరేకంగా ప్రచారం మొదలుపెట్టాడు.

- పూటకో పార్టీ.. రోజుకో మాట
- పార్టీలు మారే నాయకులపై ప్రజల్లో పలుచన
- అసెంబ్లీ ఎన్నికల్లో జోరుగా కండువా మార్పులు
- కొత్త, పాత నాయకుల మధ్య కుదరని సఖ్యత



జంగ్ తెలంగాణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల ముందు నాయకుల తీరు ప్రజల్లో అయోమయానికి గురి చేస్తోంది. వారి నాయకత్వంపై అటు పార్టీలో, ఇటు ప్రజల్లోనూ నమ్మకం లేకుండా పోతోంది. తమ రాజకీయ భవిష్యత్ కోసం వేస్తున్న అడుగులు ప్రజల ముందు పలుచన చేస్తున్నాయి. ప్రజల ముందు ఓ మాట, వెనకోమాట అన్నట్లుగా తమ అవసరాలకు అనుగుణంగా కండువాలు మార్చేస్తూ రాజకీయం చేస్తుండడంతో వారి మాటలపై నమ్మకం కోల్పోతున్నారు. ఇలాంటి నాయకులతో తమను నమ్ముకున్న పార్టీలో అనుచరగణంతోపాటు కేడర్ సైతం అయోమయంలో పడుతోంది. కొందరు చేసేది లేక తమ నాయకులు పార్టీ మారితే ఆయన వెంటే వెళ్తున్నారు. మరికొందరు తమ దారి తాము చూసుకుంటున్నారు. ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్దీ జిల్లాలో పార్టీ కండువాల మార్పులు సైతం వేగంగా జరుగుతున్నాయి. ఆయా అభ్యర్థులు ఎక్కడెక్కడ పార్టీ బలహీనంగా ఉందో చూసుకుంటూ నాయకులను తమవైపు తిప్పుకుంటున్నారు. ఆయా పార్టీల్లో టికెట్లు ఆశించిన వారంతా తమకు తోచిన దారి వెతుక్కున్నారు.

పార్టీ మారితే బలమేనా?

నాయకులు తమకు అనుకూల పార్టీ మార్పుతో బలం పెరుగుతోందనే విశ్వాసంలో ఉంటున్నారు. కొన్నిసార్లు వ్యతిరేకత కూడా వస్తోంది. ఇన్నాళ్లు వేరే ఓ పార్టీలో తిరిగి ఇప్పుడు మరో పార్టీలో చేరడంతో ఇటు సొంత పార్టీలో వారితోపాటు, అటు జనంలో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. చేరికలు అధికమై పాత, కొత్త కలయికతో నాయకుల మధ్య సఖ్యత కుదరడం లేదు. అభ్యర్థులకు కొత్త వారికి ప్రాధాన్యత ఇస్తే, పాత వాళ్లు అలక పూనుతున్నారు. కొత్త వారి రాకతో సీనియర్ నాయకులైన తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని చెప్పుకుంటున్నారు. నాయకుల మాట మార్చిన తీరుతో జనంలో సైతం నమ్మకం సన్నగిల్లుతోంది. స్థానికంగా ఉన్న నాయకత్వంపై, పార్టీపైనా వ్యతిరేకత వస్తోంది. దీంతో నిబద్ధతతో ఉన్న నాయకులకే ప్రజల్లో ఓటు రాల్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఓట్లు పడే వరకు కూడా జిల్లాలో ఇంకా కొందరు పార్టీలు మారుతారనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఎప్పుడు ఎవరు ఏ పార్టీలో ఉంటున్నారో తెలియక సతమతం అవుతున్నారు. మరోవైపు కొందరు చేరిన పార్టీలో సరైన ప్రాధాన్యత దక్కడం లేదని తిరిగి సొంత గూటికి వెళ్లే పనిలో ఉన్నారు. ఇక కొందరు ఎన్నికల వేళ తమ అవసరాలు తీర్చే పార్టీలో చేరుతున్న నాయకులు కూడా ఉన్నారు. ఇక కొందరు పాత పార్టీకి కోవర్టుగా ఉన్నారనే భయం లేకపోలేదు. దీంతో ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి పార్టీలో చేర్పించుకుంటే మేలు కంటే నష్టం జరగకుండా ఉంటే చాలనే భావనలోనూ అభ్యర్థులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

- ఎన్నికల సాధారణ పరిశీలకులు బిశ్వజిత్ దత్తా



అభ్యర్థులకు సూచనలు చేస్తున్న బిశ్వజిత్ దత్తా

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు ఎన్నికల సాధారణ పరిశీలకులు బిశ్వజిత్ దత్తా తెలిపారు. శనివారం మంచిర్యాల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రాములుతో కలిసి రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌ల రెండో విడత ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 24గంటలపాటు బందోబస్తు ఉంటుందని, ప్రతీ గదికి లాక్ సిస్టం ఏర్పాటు చేస్తామని అన్నారు. మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్‌రూం, ఎన్నికల నిర్వహణకు 289 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. సహాయ రిటర్నింగ్ అధికారి సంధ్యారాణి పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి: బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు బిశ్వజిత్ దత్తా అన్నారు. శనివారం బెల్లంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి రాహుల్‌తో కలిసి అభ్యర్థులు, రాజకీయ పక్షాల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌ల ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి బజారు ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు.

ప్రపంచ కప్ మనదే.. బెట్టింగ్..?

- నేడు ఇండియా, ఆస్ట్రేలియా క్రికెట్ ఫైనల్ మ్యాచ్
- జిల్లా కేంద్రంలో జోరుగా పందేలు
- చేతులు మారుతున్న రూ.లక్షలు
- అంతా ఆన్‌లైన్‌లోనే వ్యవహారం



మంచిర్యాలక్రైం: మంచిర్యాలకు చెందిన ఓ సింగరేణి ఉద్యోగి కొడుకు ఇంట్లో నుంచి రూ.50వేలు తీసుకెళ్లి ఈ నెల 15న ఇండియా వర్సెస్ న్యూజిలాండ్ క్రికెట్ మ్యాచ్‌లో బెట్టింగ్ ఆడి పోగొట్టుకున్నాడు. ఈ విషయం ఇంట్లో తెలిసి గట్టిగా మందలించారు. దీంతో మనస్తాపం చెందిన ఆ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేయగా.. కుటుంబ సభ్యులు చాకచక్యంగా కాపాడారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇలా చాలామంది క్రికెట్ ఐపీఎల్, వరల్డ్‌కప్, వన్డే మ్యాచ్‌లు ఏది జరిగినా బెట్టింగ్ సర్వసాధారణమైంది. ఇక ఇండియా ఫైనల్‌కు చేరడంతో వ్యాపారవేత్తలు, యువకులు ఆన్‌లైన్‌లోనే బెట్టింగ్‌కు దిగుతున్నారు. శనివారం నుంచే కొందరు యువకులు ఒక చోట చేరి ఆన్‌లైన్ బెట్టింగ్‌కు సిద్ధమయ్యారు. రూ.1000 నుంచి రూ.లక్ష వరకు బెట్టింగ్‌లు సాగుతున్నాయి. ఎంత బెట్టింగ్ చేస్తే అంతకు రెట్టింపు చెల్లిస్తారు.

కమీషన్

క్రికెట్‌పై ఉన్న అభిమానాన్ని కొందరు వ్యాపారంగా మలుచుకుంటున్నారు. కమీషన్ తీసుకుంటు బుకీలుగా మారుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్‌లు నడిపిస్తూ రెండు వర్గాల తరపున మధ్యవర్తిత్వం వహిస్తున్నారు. సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో కొందరు స్నేహితులు బృందంగా ఏర్పడి బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఒక్కో బాల్‌కు బెట్టింగ్ ఆడుతూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి యాప్‌ల ద్వారా డబ్బు పంపే అవకాశం ఉండడంతో సెల్‌ఫోన్ల ద్వారా ఆన్‌లైన్ లావాదేవీలు సాగిస్తున్నారు. గతంలోనూ జిల్లా కేంద్రంలో ఇలాంటి ఘటనలు వెలుగు చూశాయి. గతంలో ఐపీఎల్ బెట్టింగ్‌లు జరిపిన వారే మళ్లీ ఈసారి రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. గతంలో జిల్లా కేంద్రంలోని ఓ ఇంట్లో క్రికెట్ బెట్టింగ్ జరుగుతుందనే సమాచారం మేరకు ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో అందరూ యువకులే ఉండడం గమనార్హం. ఇంట్లో తల్లిదండ్రులకు తెలియకుండా బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకులు అవి అయిపోయాక స్నేహితుల వద్ద, కొందరి వద్ద అధిక వడ్డీకి అప్పు చేసి మరీ ఆడుతున్నారు.

కోడ్ భాష

బుకీల వద్ద కోడ్ భాష వాడుతున్నారు. ఒకసారి రిజిష్టర్ అయిన నంబర్ నుంచి ఫోన్ వస్తేనే బెట్టింగ్ వ్యవహారంపై మాట్లాడుతారు. గతంలో బెట్టింగ్ రాయుళ్లు 'లెగ్', 'ఈటింగ్' అనే కోడ్ భాషను వాడారు. ఎవరు ఎన్ని లెగ్‌లు తీసుకుంటే అన్ని లెగ్గులకు లెక్కగట్టి చెల్లించాల్సి ఉంటుంది. లెగ్‌కు ఇంత అని ముందే రేటు ఫిక్స్ చేస్తారు. బుకీల ద్వారా బెట్టింగ్‌లు పెడితే మ్యాచ్ జరగడానికి ముందే లావాదేవీలు చేస్తారు.

పోలీసులు, తల్లిదండ్రులు దృష్టి సారించాలి

యువత క్రికెట్ బెట్టింగ్‌లపై తల్లిదండ్రులు, పోలీస్ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో పోలీస్‌లు బిజీగా ఉండడంతో క్రికెట్ బెట్టింగ్‌లపై దృష్టి సారించకలేకపోతున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లాలో బెట్టింగ్‌లు జోరుగానే సాగుతున్నట్లు సమాచారం.

పోల్ చిట్టీల పంపిణీ షురూ



చెన్నూర్‌లో ఓటరు స్లిప్‌ల పంపిణీ ప్రారంభిస్తున్న ఆర్వో

చెన్నూర్: ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంలో ఓటరు స్లిప్పులే కీలకం. ఓటరు జాబితాలో పేరున్నా ఓటరు స్లిప్పులు ఇంటికి రాకపోతే ఓటు హక్కు వినియోగానికి జనం సుముఖత చూపరు. ఇంటికి పోల్ చిట్టీ వచ్చిందంటే ఆ చిటపట్టుకొని పోలింగ్ బూత్‌లకు వెళ్లడం నిరక్షరాస్యుల నుంచి అక్షరాస్యుల వరకు పరిపాటిగా మారింది. గతంలో ఓటరు స్లిప్పులను ప్రధాన పార్టీ కార్యకర్తలు పంపిణీ చేసేవారు. ఓటింగ్ శాతం పెంచాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఓటరు స్లిప్పుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రారంభమైంది. చెన్నూర్ నియోజకవర్గంలో శుక్రవారం నుంచి బీఎల్‌వోలు ఓటరు స్లిప్పులు పంపిణీ ప్రారంభించారు.

ఓటింగ్ శాతం పెంపు కోసం..

ఓటు హక్కు వినియోగంతోనే సుపరిపాలన అందించే ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం ఉంటుంది. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల సంఘం వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కళాజాత బృందాలతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. సోషల్ మీడియాలో సైతం ఓటు హక్కు వినియోగంపై ప్రచారం సాగిస్తున్నారు.

227 పోలింగ్ బూత్‌లు..

చెన్నూర్ నియోజకవర్గంలో 227 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. పోలింగ్ స్లిప్పు పంపిణీ కోసం 227 మంది బీఎల్‌వోలను నియమించారు. అన్ని పోలింగ్ బూత్‌లలో ఓటరు స్లిప్‌లు పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లకు సైతం సమాచారం అందజేస్తున్నారు.

చెన్నూర్ నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

మండలం	ఓటర్లు
మందమర్రి	77205
జైపూర్	28840
భీమారం	12678
చెన్నూర్	43825
కోటపల్లి	25735
మొత్తం	1,88,283

ఓటింగ్ శాతం పెంచేందుకు..



ఓటింగ్ శాతం పెంచాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వివిధ మార్గాల ద్వారా ప్రచారం సాగిస్తున్నాం. నియోజకవర్గ వ్యాప్తంగా రెండు విడతలుగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేశాం. కళాజాత బృదాల ఆటపాటల ద్వారా ప్రచారం చేయిస్తున్నాం. బీఎల్‌వోలు ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తూ ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం

– సిడాం దత్తు, చెన్నూర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి

అమ్మకానికి కేసీఆర్ గుడి, విగ్రహం

- గుడికట్టినా గుర్తింపు దక్కలేదని..
- గుడి వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు



కేసీఆర్ గుడి, అందులో కేసీఆర్ విగ్రహం



గుడిని, విగ్రహాన్ని, అమ్ముతున్నట్లు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

దండేపల్లి: మండల కేంద్రం దండేపల్లికి చెందిన గుండ రవీందర్ సీఎం కేసీఆర్‌కు వీరాభిమాని. ఆ అభిమానంతో 2016లో తన ఇంటి వద్ద కేసీఆర్‌కు గుడి కట్టించి అందులో పాలరాతి విగ్రహాన్ని ఏర్పాటు చేశాడు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తనకు ఎలాంటి గుర్తింపు దక్కలేదని కొంతకాలం కేసీఆర్ విగ్రహానికి ముసుగేశాడు. ఇప్పుడు ఏకంగా ఆ గుడిని, గుడిలోని విగ్రహాన్ని అమ్మకానికి పెడుతూ శనివారం ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. రవీందర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని, ఉద్యమకారుల్లో ఉద్యమ స్ఫూర్తి నింపేందుకు ఉద్యమ సమయంలో దండేపల్లిలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సొంత ఖర్చుతో ఏర్పాటు చేశానని చెప్పాడు. కొద్ది రోజుల తర్వాత ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశానని పేర్కొన్నాడు. కేసీఆర్‌కు గుడికట్టి, విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజించానని వివరించాడు. ఇవన్నీ చేసినా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత తనకు ఎలాంటి గుర్తింపు దక్కలేదని, పైగా పార్టీ పరంగా కూడా ఎలాంటి లబ్ధి చేకూరలేదని వాపోయాడు. విగ్రహాల ఏర్పాటుతో ఆర్థికంగా నష్టపోయానని, నష్టాన్ని పూడ్చుకునేందుకు, కేసీఆర్ గుడిని, విగ్రహాన్ని అమ్ముతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా, గతంలో ఆయన బీఆర్ఎస్ పార్టీలో ఉండగా.. ప్రస్తుతం బీజేపీలో ఉన్నాడు.

ఎన్నికల ప్రతీ ఖర్చు లెక్కించాలి



అభ్యర్థుల ఖర్చు తెలుసుకుంటున్న పరిశీలకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు చేసే ప్రతీ ఖర్చును విధిగా లెక్కించాలని కేంద్ర ఎన్నికల పరిశీలకులు బిశ్వజిత్‌దత్తా, ఎన్నికల ఖర్చుల పరిశీలకులు అశోక్ కుమార్‌సత్తార్ సూచించారు. శనివారం బెల్లంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆర్వో రాహుల్‌తో కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీల ఏజెంట్లతో ప్రచార ఖర్చులు, రిజిష్టర్ల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రతీ అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేయవచ్చని తెలిపారు. రోజు వారీ ఖర్చును అభ్యర్థులు, ఏజెంట్లు ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని, రిజిష్టర్లు నిర్వహించాలని అన్నారు. ఈ నెల 30న పూర్తిస్థాయిలో పోలింగ్ జరిగేలా చూడాలని, ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించాలని, పోలింగ్ కేంద్రాల వారీగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లు ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు సహకరించేలా చూడాలని అన్నారు. ప్రచారంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే చర్యలకు పాల్పడవద్దని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇబ్బందులు రాకుండా ధాన్యం సేకరించాలి

- టోల్ ఫ్రీ నంబరు 6303928682
- ధాన్యం సేకరణకు ప్రత్యేక అధికారులు
- జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వానాకాలంలో సాగు చేసిన వరి ధాన్యం రైతులకు ఇబ్బందులు లేకుండా సేకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. ఇబ్బందులపై ఫిర్యాదులకు కంట్రోల్ రూం టోల్‌ఫ్రీ నంబరు 6303928682 ఏర్పాటు చేశామని తెలిపారు. శనివారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో జిల్లాలోని ఆయా మండలాలకు నియమించిన 14 మంది ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మండలాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు ధాన్యం సేకరణలో నాణ్యత నిబంధనల మేరకు ఆరబెట్టిన, తాలు తప్ప, చెత్త లేని ధాన్యం తూకం వేసేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు అనుబంధంగా ఉన్న మిల్లులు, లారీల తరలింపు, సత్వరమే ధాన్యం అన్‌లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు నీడ, తాగునీరు, తదితర సదుపాయాలు ఏర్పాటు చేసేలా చూడాలని అన్నారు. ధాన్యం సేకరణకు అనుగుణంగా ఆయా కొనుగోలు కేంద్రాలకు గన్నీ సంచులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. సమావేశ అనంతరం కంట్రోల్ రూమ్ ప్రారంభించి మాట్లాడుతూ లారీల సమస్యతోపాటు మిల్లర్లు ఏవైనా ఇబ్బందులకు గురి చేస్తే రైతులు ఫిర్యాదు చేయాలని అన్నారు. ధాన్యం సేకరణకు మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించారు.

క్లుప్తంగా

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం



కాలిన ఇంటి ఎదుట బాధితుడు

వేమనపల్లి: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బదిరె వెంకటేశ్‌కు చెందిన ఇల్లు శనివారం ప్రమాదవశాత్తు కాలిపోయింది. సాయంత్రం కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లగా ప్రమాదవశాత్తు ఇంట్లో మంటలు చెలరేగాయి. ఇరుగుపొరుగు వారు సమీప వ్యవసాయ పంపుసెట్లకు పైపులు అమర్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఈ ప్రమాదంలో రూ.5 వేల నగదు, పిల్లల సర్టిఫికెట్లు, బ్యాగులు, మంచాలు, నిత్యావసరాలు కాలి బూడిదయ్యాయి. కాగా, తనకు ప్రభుత్వ సాయమందించి ఆదుకోవాలని కోరుతూ బాధితుడు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశాడు.

స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలి



కన్నెపల్లిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

భీమిని: ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య సూచించారు. శనివారం కన్నెపల్లి, భీమిని మండలాల్లో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకావద్దని, ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట తాండూర్ సీఐ శ్రీనివాస్‌రావు, కన్నెపల్లి, భీమిని ఎస్సైలు నరేశ్, ప్రశాంత్, అశోక్, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

భీమారం: పండించిన వరిధాన్యం దళారుల పాలు చేయకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తరలించాలని డీఆర్డీవో శేషాద్రి కోరారు. మండలంలోని భీమారం, పోలంపల్లి, అంకూసాపూర్, పోలంపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. గతం కన్నా రెట్టింపు స్థాయిలో రైతులు వరి సాగు చేస్తున్నారని తెలిపారు. కొందరు రైతులు ఇప్పటికీ దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. దీంతో తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ డీపీఎం వేణు, ఏపీఎం త్రియంబక్, సీసీ దర్శనాల శంకర్ పాల్గొన్నారు.

20నుంచి బెల్లంపల్లిలో పత్తి కొనుగోళ్లు ప్రారంభం

బెల్లంపల్లి: బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఈనెల 20వ తేదీ నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్కెట్ కమిటీ పరిధి రేపల్లెవాడ శివారులోని రెండు ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల్లో పత్తి క్రయవిక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించినట్లు క్వింటాల్‌కు రూ.7,020 మద్దతు ధరతో సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుందని తెలిపారు. మార్కెట్ యార్డు పరిధిలోని రైతులు పత్తి విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.

మందమర్రి ఓటర్లే కీలకం

- ఇక్కడ 77,205 మంది ఓటర్లు
- బరిలో 14 మంది అభ్యర్థులు

మండలాల వారీగా ఓటర్లు

మండలం	ఓట్ల సంఖ్య
మందమర్రి	77,205
చెన్నూర్	43,825
కోటపల్లి	25,735
జైపూర్	28,840
భీమారం	12,678
మొత్తం	1,88,283



చెన్నూర్: చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో గెలుపోటములను ప్రభావితం చేసేది మందమర్రి ఓటర్లే. గతంలో జరిగిన ఎన్నికల విజయావకాశాలను పరిశీలిస్తే.. మందమర్రి ఓటర్లు ఏ పార్టీకి మొగ్గు చూపితే ఆ పార్టీ అభ్యర్థి విజయకేతనం ఎగురవేసిన దాఖలాలున్నాయి. నియోజకవర్గంలో కార్మిక, కర్షక ఓటర్లు కలగలిపి ఉన్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో మందమర్రిలోగల కార్మిక కుటుంబాల ఓట్లే గెలుపోటములను ప్రభావితం చేస్తాయి. దీంతో అన్ని పార్టీల అభ్యర్థులు మందమర్రిపైనే ఆశలు పెట్టుకున్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో ప్రస్తుతం 14మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇందులో ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీతో పాటు 10 మంది స్వతంత్రులు బరిలో ఉన్నారు. ఎన్నికలు మరో 12రోజులుండగా అభ్యర్థులంతా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రచారం జోరుగా సాగిస్తున్నారు.

మందమర్రి ఓట్లే అధికం..

చెన్నూర్ నియోజకవర్గంలో మొత్తం 1,88,283 మంది ఓటర్లున్నారు. ఒక మందమర్రి మండలంలోనే 77,205 మంది ఓటర్లుండగా.. చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల్లో 1,11,078 మంది ఓటర్లున్నారు. ఇందులో 50 వేలకు పైగా సింగరేణి కార్మికులే ఉన్నారు. 2018 ఎన్నికల్లో నియోజకవర్గంలో 1,64,405 మంది ఓటర్లుండగా.. 2023 ఎన్నికల నాటికి సుమారు 20వేలకు పైగా కొత్త ఓటర్లు పెరిగారు.

ఫోన్ చేసి పలకరిస్తూ..

- వలస ఓటర్లపై అభ్యర్థుల గురి

మంచిర్యాలఅర్బన్: 'అన్నా నమస్తే.. మీపిల్లలు ఎక్కడ ఉంటున్నారు.. మీ ఇంట్లో ఆరోట్లున్నాయి. పిల్లలు దూరప్రాంతాల్లో ఉంటే పిలిపించి ఈసారి ఓటు వేసేలా చూడండి..' అంటూ అసెంబ్లీ బరిలో నిలిచిన అభ్యర్థులు, ద్వితీయ శ్రేణి నాయకుల నుంచి సెల్‌ఫోన్ సంభాషణలు షురూ అయ్యాయి. జిల్లాలో ఓటు హక్కు కలిగిన వారు వేర్వేరు కారణాలతో ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల్లో స్థిరపడటంతో పోలింగ్ సమయానికి తీసుకువచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల్లో ఒక్క ఓటు గెలుపోటములను తారుమారు చేస్తుంది. దీంతో పోలింగ్ తేదీ సమీపిస్తుండగా ప్రధాన పార్టీల అభ్యర్థులు వలస ఓటర్లపై దృష్టి సారిస్తున్నారు. కొలువు, చదువు, వివిధ అవసరాలు, వ్యాపారాల నిమిత్తం హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిని సొంత ప్రాంతాలకు తీసుకువచ్చేందుకు యత్నిస్తున్నారు. బదిలీలపై వెళ్లిన ఉద్యోగుల వివరాలు సేకరిస్తున్నారు. ఇందుకు స్థానిక నాయకులతో చర్చలు జరుపుతున్నారు. అవసరమైన రవాణా ఖర్చులు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వార్డుల వారీగా నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగి వివిధ ప్రాంతాల్లో ఉంటున్నవారి జాబితా సిద్ధం చేసుకున్నారు. ఒకడుగు ముందుకేసి వారిని సెల్ ఫోన్లో పలకరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. వారికి రెగ్యులర్‌గా టచ్‌లో ఉంటున్నారు.

ముగిసిన గుస్సాడీ సంబురాలు



చిన్నసాకడలో ఇప్పచెట్టు వద్ద పూజలు చేస్తున్న గుస్సాడీలు, ఆదివాసీలు

కెరమెరి మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో పక్షం రోజులుగా కొనసాగిన గుస్సాడీ సంబురాలు శుక్రవారం ముగిశాయి. ఆయా గ్రామాల్లో కోలబోడి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. అనంతరం డప్పుచప్పుళ్లతో ఇప్పచెట్ల వద్దకు వెళ్లి పూజలు చేశారు. ఏత్మాసూర్ దేవతను పూజించి మొక్కు తీర్చుకున్నారు. గుస్సాడీలు నెమలి పింఛం టోపీ, జింక చర్మం, కాళ్ల గజ్జెలు, మెడలోని ఆభరణాలు, పోరీలు, దాండియా కర్రలు, దుస్తులు, డప్పులు ఇప్పచెట్ల వద్ద దాచుకుని పూజలు చేశారు. కులదేవతలకు మొక్కుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల సమీపంలోని జలవనరుల్లో స్నానాలాచరించారు. – కెరమెరి



పెద్దసాకడలో గుస్సాడీల ఆశీర్వాదం తీసుకుంటున్న చిన్నారులు



హట్టిలో కోలాటం ఆడుతున్న దండారీలు



చిన్నసాకడలో భేటింగ్ అవుతున్న ఆదివాసీలు

రాష్ట్రస్థాయి పోటీలకు 'మోడల్' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కాసిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల విద్యార్థులు పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) అండర్–17 ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగమల్లయ్య తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు జీ శంకర్‌గౌడ్, పీ ప్రశాంత్ మంచిర్యాలలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. వీరు మహబూబాబాద్ జిల్లా జడ్చర్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, పీఈటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

'వాళ్లను దింపితేనే నిరుద్యోగులకు ఉద్యోగాలు'



మాట్లాడుతున్న మహిపాల్ యాదవ్

మంచిర్యాలక్రైం: తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీశ్‌రావులను రాజకీయ ఉద్యోగాల నుంచి దింపితేనే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని తెలంగాణ నిరుద్యోగ రక్షణ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మహిపాల్‌యాదవ్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ఓయూజేఏసీ ప్రచారంలో భాగంగా శనివారం స్థానిక గాంధీ పార్క్ లైబ్రరీ వద్ద నిరుద్యోగులతో మాట్లాడారు. పదేళ్లలో నోటిఫికేషన్ ద్వారా ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని విమర్శించారు. కార్యక్రమంలో ఓయూజేఏసీ టీమ్, తెలంగాణ నిరుద్యోగ రక్షణ జేఏసీ నాయకులు ప్రేమ్, అలేఖ్య, సీనియర్ న్యాయవాది శరత్‌కుమార్, నటేశ్వర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ న్యాయవాదులకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ జూనియర్ న్యాయవాదులకు శిక్షణ ఇచ్చారు. శనివారం మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో కోర్టు స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శతాబ్ది ఉత్సవాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా జూనియర్ న్యాయవాదులకు ఆయన శిక్షణ ఇచ్చారు. నాలుగు నెలలపాటు ప్రతీ శనివారం ఉత్సవాల్లో భాగంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. చట్టాలపై అవగాహన, కేసుల్లో మెలకువలు, న్యాయవాద వృత్తి విధానాలు, పద్ధతులు, కొన్ని కోర్టులు ఇచ్చిన జడ్జిమెంట్లు వివరించారు. శతాబ్ది ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. అనంతరం సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్‌రావు, అక్కల శ్రీధర్ పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.


మహిళా సంఘాల కరుణ ఎవరిపైనో!

- జయాపజయాలపై ప్రభావం చూపనున్న ఎస్‌హెచ్‌జీలు
- బెల్లంపల్లి నియోజకవర్గంలో 42,518 మంది సభ్యులు



నెన్నెల: అసెంబ్లీ ఎన్నికల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. బెల్లంపల్లి నియోజకవర్గంలో 1,73,335 మంది ఓటర్లున్నారు. ఇందులో మహిళలు 86,749 మంది ఉండగా.. ఇందులో మహిళా సంఘాల సభ్యులు 42,518 మంది ఉన్నారు. బెల్లంపల్లి మండలంలో మహిళా సంఘాల సభ్యులు 6,851, నెన్నెలలో 6,561, భీమినిలో 3,231, కన్నెపల్లిలో 4,644, కాసిపేటలో 8,164, తాండూర్‌లో 8,500, వేమనపల్లిలో 4,561 మహిళా సంఘాల సభ్యులున్నారు. వారి ఓట్లకు గాలం వేసేందుకు అన్ని పార్టీలు వ్యూహ ప్రతి వ్యూహాలతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే గ్రామాలవారీగా ఆయా రాజకీయ పార్టీల నాయకులు దృష్టి సారించారు. అభ్యర్థులు నేరుగా కాకుండా ఆయా ప్రాంతాల్లోని క్షేత్రస్థాయి నేతలతో మాట్లాడిస్తున్నారు. వారికి ఉన్న ఇబ్బందులను తెలుసుకుంటున్నారు. మహిళా సంఘాలకు పార్టీల ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న అంశాలపై కాకుండా స్థానికంగా ఏమి అవసరమో గుర్తించి నివారించే ప్రయత్నం చేస్తున్నారు. గ్రామ స్థాయిలో మహిళా సంఘాల భవనాలు, వాటిలో సౌకర్యాలతో పాటు తమకు అనుకూలంగా మారేందుకు ఏమి కావాలో అడుగుతున్నారు. ఈ విషయంలో గ్రామ, మండల స్థాయి సంఘాల నాయకులతో మంతనాలు జరుపుతున్నారు. అభ్యర్థులు మహిళా సంఘాల సభ్యులతో సంప్రదింపులు చేస్తున్నట్లు సమాచారం. మహిళా సంఘాలను మచ్చిక చేసుకుని తమ వైపు ఓట్లు వేసుకునేలా ఎవరికి వారే ప్రయత్నిస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులకు ఏమి కావాలనే విషయంలో ఆచీతూచి వ్యవహరిస్తున్నారు. వీవోలు, మండల సమాఖ్యలను సంప్రదించి ఓట్లు తమకు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. డబ్బులతో ప్రలోభపెట్టే చర్యలకు పూనుకున్నట్లు సమాచారం. దీని ద్వారా గంపగుత్తగా సంఘాల ఓట్లన్నీ తమ ఖాతాల్లో పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ వ్యవహారంపై అభ్యర్థులు రహస్యంగా మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది. అభ్యర్థుల భవిష్యత్‌ను తేల్చే శక్తి మహిళా సంఘాలకు ఉందని చెప్పకనే చెబుతున్నారు. వీటిపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఈ ఓట్లకు ఎలాగైనా గాలం వేయాలని అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. మెజార్టీ ఓట్లు ఎవరికి పోలైతే వారి గెలుపు ఖాయమని విశ్లేషకులు కూడా భావిస్తున్నారు.

'మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి'



చెన్నూర్‌రూరల్: మామిడిలో పూతకు ముందు, పూత సమయం, కాయదశలో సస్యరక్షణ చర్యలు చేపట్టకుంటే దిగుబడి తగ్గుతుందని వ్యవసాయాధికారి తిరుపతి తెలిపారు. మామిడిలో సస్యరక్షణ చర్యలపై ఓ ప్రకటనలో ఆయన పలు సూచనలు చేశారు. జిల్లాలోని బెల్లంపల్లి, జైపూర్, నెన్నెల, భీమిని, కోటపల్లి, వేమనపల్లి, చెన్నూర్ మండలాల్లో రైతులు మామిడి సాగు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జూన్ నుంచి అక్టోబర్ వరకు రైతులు మామిడిలో పాటించిన సమగ్ర సాగు పద్ధతులను అనుసరించి నవంబర్‌లో ముదిరిన రెమ్మల్లో పూమొగ్గ ఏర్పడుతుందని తెలిపారు. వాతావరణ పరిస్థితులతో డిసెంబర్ రెండో వారం నుంచి జనవరి మొదటి వారం వరకు పూమొగ్గలు వస్తాయని పేర్కొన్నారు. ఒక్కోసారి చలి ఎక్కువగా ఉన్నప్పుడు పూమొగ్గలు ఆలస్యంగా కనబడతాయని తెలిపారు. నీటి వసతి ఉన్న తోటల్లో మామిడి చెట్ల పాదుల్లో నీటి తడి అందించాలని సూచించారు. లీటరు నీటికి వెట్టబుల్ సల్ఫర్ ఐదుగ్రాములు కలిపి పిచికారీ చేస్తే పూమొగ్గలన్నీ ఒకేసారి చిగురిస్తాయని తెలిపారు. లీటరు నీటిలో పొటాషియం నైట్రేట్ (మల్టికే) 10గ్రాములతో పాటు యూరియా 10 గ్రాములు కలిపి పిచికారీ చేసినా ఫలితం ఉంటుందని పేర్కొన్నారు. ఈ పద్ధతులు ముందస్తుగా పాటిస్తే పూత బాగా రావడమే కాకుండా, కాయలు కూడా రాలిపోకుండా ఉంటాయని తెలిపారు.

రూ.2లక్షల నగదు సీజ్



పట్టుబడిన నగదును ఎఫ్‌ఎస్‌టీ టీమ్‌కు అప్పగిస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: ఎన్నికల నియమావళి ఉల్లంఘించి రూ.2లక్షలు నగదు తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక లక్ష్మీనగర్‌కు చెందిన రాంపెల్లి వెంకటరమణాచారి శనివారం అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనంపై స్థానిక మెడిలైఫ్ హాస్పిటల్ ప్రాంతంలో తిరుగుతుండగా పోలీసులు తనిఖీ చేశారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ.2లక్షల నగదు లభించగా ఎన్నికల నిబంధనల ప్రకారం సీజ్ చేశారు. ఈ మొత్తాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

'పిల్లల వ్యాక్సినేషన్‌లో అశ్రద్ధ వద్దు'



రామారావుపేటలో తల్లులతో మాట్లాడుతున్న అనిత

జైపూర్: పిల్లల వ్యాక్సినేషన్‌పై అశ్రద్ధ చేయొద్దని, సకాలంలో వ్యాక్సిన్ వేయించాలని జిల్లా వ్యాక్సినేషన్ అధికారి డాక్టర్ అనిత తెలిపారు. శనివారం మండలంలోని జైపూర్, కుందారం ఆస్పత్రి పరిధిలోగల నర్వ, రామారావుపేట గ్రామాల్లో వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. సబ్ సెంటర్లలో రికార్డులు పరిశీలించి వ్యాక్సినేషన్‌పై పలు సూచనలు చేశారు. అనంతరం వ్యాక్సినేషన్ తీసుకున్న పిల్లల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు.

ఈవీఎం–విశేషాలు..

- పారదర్శక ఓటింగ్‌కు భరోసా
- మొదటిసారి 1982లో కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగం



ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)

భైంసాటౌన్(ముధోల్): సమర్థవంత ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం అనేక సంస్కరణలు చేపట్టింది. ఇందులో భాగంగా బ్యాలెట్ బాక్స్ మొదలు ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) వరకు ఓటింగ్ విధానంలో మార్పులు తెచ్చింది. ఈవీఎం, వీవీప్యాట్, నోటా లాంటి నూతన విధానాలతో పారదర్శక ఓటింగ్‌కు భరోసానిస్తోంది. 1999 ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాల ముద్రణకు 7,700 టన్నుల కాగితం వాడారు. 2009 సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ కోసం ఈవీఎం వాడడంతో 10 వేల టన్నుల కాగితం మిగిలింది. ఈవీఎంలను మొదటిసారిగా 1982లో కేరళ రాష్ట్రంలోని పర్వూర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఉపయోగించారు. ఈవీఎంలపై నెలకొన్న సందేహాలకు నివృత్తిగా పలు సమాధానాలను ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎం విశేషాలపై కథనం..

ఈవీఎం అంటే?

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్. ఇది ఎన్నికల్లో పోలైన ఓట్లను ఎలక్ట్రానిక్ పద్ధతిలో రికార్డు చేయడంతో పాటు లెక్కించే పరికరం. ఈవీఎంలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌తో పాటు జతగా వీవీప్యాట్ (ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) ఉంటుంది.

రవాణా సులభం..

బ్యాలెట్ బాక్సులతో పోలిస్తే ఈవీఎంల రవాణా చాలా సులభం. తేలికగా, పోర్టబుల్‌గా ఉండడంతో దూరంగా, రోడ్డు సౌకర్యం లేనిప్రాంతాలకు కూడా వీటిని సులభంగా తరలించవచ్చు.

గరిష్ఠంగా అభ్యర్థుల సంఖ్య, వేసే ఓట్లు..

ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌లో నోటాతో పాటు 15 మంది అభ్యర్థుల పేర్లు మాత్రమే ఉంటాయి. ఒకవేళ అంతకంటే ఎక్కువ అభ్యర్థులు బరిలో ఉంటే మరో బ్యాలెట్ యూనిట్‌ను వినియోగించాల్సి ఉంటుంది. ఇలా ఒక ఈవీఎంకు 24 బ్యాలెట్ యూనిట్లు అనుసంధానించవచ్చు. తద్వారా 384 మంది అభ్యర్థుల వరకు సేవలు అందిస్తుంది. ఇక ఓట్ల విషయానికి వస్తే గరిష్ఠంగా 2 వేల ఓట్లను రికార్డు చేస్తుంది. కానీ.. ఎన్నికల్లో సాధారణంగా 1,500 ఓట్లు నమోదు చేయడానికి మాత్రమే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ఉపయోగిస్తున్నారు.

విద్యుత్ లేని ప్రాంతాల్లో..

ఈవీఎంలకు విద్యుత్ సరఫరా అవసరం లేదు. ఈవీఎం, వీవీప్యాట్‌లకు సొంతంగా బ్యాటరీ/పవర్-ప్యాక్ సౌకర్యం ఉండడంతో విద్యుత్ సరఫరా లేని ప్రాంతాల్లోనూ వీటిని వినియోగించవచ్చు.

ఓటు ఎలా వేయవచ్చు?

ఈవీఎం ఓటింగ్ విధానంలో కంట్రోల్ యూనిట్ ప్రిసైడింగ్ అధికారి వద్ద, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్ ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లో ఉంటుంది. బ్యాలెట్ యూనిట్‌పై ఓటరు తనకు నచ్చిన అభ్యర్థి గుర్తుకు ఎదురుగా ఉన్న బ్లూబటన్ నొక్కగానే ఎరుపురంగు లైట్ మెరుస్తుంది. ఎంపిక చేసుకున్న అభ్యర్థి సీరియల్ నంబర్, పేరు, గుర్తు చూపించే పేపర్ స్లిప్ వీవీప్యాట్ విండో ద్వారా సుమారు ఏడు సెకన్ల పాటు కనిపించి డ్రాప్‌బాక్స్‌లో పడగానే కొద్దిసేపు బీప్ అనే శబ్దం వస్తుంది. దీంతో ఓటు నమోదైందని తెలుసుకోవచ్చు.

నిర్ధారించుకున్న తర్వాతే పోలింగ్..

పోలింగ్ ప్రారంభానికి ముందు కంట్రోల్ యూనిట్‌లో రిజల్ట్ బటన్‌ను నొక్కి ఇప్పటికే 'దాచిన' ఓట్లేవీ నమోదు కాలేదని ప్రిసైడింగ్ అధికారి హాజరైన పోలింగ్ ఏజెంట్లకు ప్రదర్శిస్తారు. వీవీప్యాట్ డ్రాప్‌బాక్స్ తెరిచి ఖాళీగా ఉందని చూపుతారు. వారి సమక్షంలో కనీసం 50 ఓట్లతో మాక్ పోల్ నిర్వహిస్తారు. ఆ తర్వాత ఆ ఫలితాన్ని క్లియర్ చేసి అసలు పోల్ ప్రారంభించే ముందు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌కు సీలు వేస్తారు.

పోలైన ఓట్ల సంఖ్య ఇలా తెలుసుకోవచ్చు..

ఈవీఎం కంట్రోల్ యూనిట్‌లో ఫలితం బటన్‌తో పాటు, టోటల్ బటన్ ఉంటుంది. పోల్ సమయంలో ఎప్పుడైనా ఈ బటన్ నొక్కితే అప్పటివరకు పోలైన మొత్తం ఓట్ల సంఖ్య తెలుస్తుంది. పోలింగ్ ముగియగానే క్లోజ్ బటన్ నొక్కితే మెషిన్ ఇకపై ఓట్లను అంగీకరించదు.

ఈవీఎంల భద్రత..

పోలింగ్ తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో సెక్యూరిటీ బలగాల పహారాలో భద్రపరుస్తారు. పోటీలో ఉన్న అభ్యర్థులు నియమించిన ఏజెంట్లు కౌంటింగ్ వరకు ఈవీఎంలను 24 గంటలూ చూసేందుకు అనుమతిస్తారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌లకు తాళాలు వేసి ఎన్నికల అధికారులతో పాటు అభ్యర్థులు లేదా వారి ప్రతినిధుల సంతకాలతో సీలు వేస్తారు.

కౌంటింగ్ డే..

కౌంటింగ్ రోజున అభ్యర్థులు/వారి ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారి, ఎన్నికల సంఘం పరిశీలకుల సమక్షంలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ తెరుస్తారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. లెక్కింపు పూర్తయిన తర్వాత, వీవీప్యాట్ స్లిప్‌లను బయటకు తీసి, అభ్యర్థులు/వారి ప్రతినిధుల సమక్షంలో నల్లటి కవరులో భద్రపరుస్తారు.

ఓటరు ఫిర్యాదు చేయవచ్చు

ఓటరు ఓటును నమోదు చేసిన తర్వాత వీవీప్యాట్‌లో కనిపించే పేపర్ స్లిప్‌లో ఓటు వేసిన అభ్యర్థి కాకుండా వేరే అభ్యర్థి పేరు, గుర్తు వచ్చినట్లయితే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలి. నిజమని తేలితే ఆ ఓటింగ్ యంత్రంలో తరువాతి ఓట్ల నమోదును నిలిపివేసి రిటర్నింగ్ అధికారి ఇచ్చిన ఆదేశాల ప్రకారం నడుచుకుంటారు.

ఈవీఎం మొరాయిస్తే..

పోలింగ్ సమయంలో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ క్రమం తప్పితే బ్యాలెట్, కంట్రోల్ యూనిట్‌తో పాటు వీవీప్యాట్‌తో కూడిన కొత్త సెట్ ఏర్పాటు చేస్తారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో రిజర్వ్ దశ నుంచి పనిచేయని దశ వరకు నమోదైన ఓట్లు, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ బ్యాలెట్ స్లిప్‌లు కంపార్ట్‌మెంట్ మెమరీలో భద్రంగా ఉంటాయి. వీవీప్యాట్ మాత్రమే పనిచేయకపోతే కంట్రోల్ యూనిట్‌లో నమోదైన ఓట్లు దాని మెమరీలో భద్రంగా ఉంటాయి. దీంతో రిజర్వ్ మిషన్ల నుంచి పనిచేయని వీవీప్యాట్ తొలగించి మరొకటి ఏర్పాటు చేసిన తర్వాత పోలింగ్ తిరిగి ప్రారంభిస్తారు. ఏదైనా సాంకేతిక కారణాలతో కంట్రోల్ యూనిట్‌లలో నమోదైన ఓట్లను నిర్ధారించకపోతే కంట్రోల్ యూనిట్ వీవీప్యాట్ స్లిప్‌లను లెక్కిస్తారు.